# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-08-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రైతుల సాధికారతకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**
2. **రాష్ట్రంలో భూ, రెవెన్యూ సంబంధిత సమస్యలపై ఈ నెల 15 నుంచి 30 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.**
3. **క్షయ వ్యాధి నివారణకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.**
4. **యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కలిగివుండాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సూచించారు.**
5. **ఈరోజు ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని పాటిస్తున్నాం.**

==========================

రైతుల సాధికారతకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గత రబీలో ధాన్యం విక్రయించిన రైతులకు 674.47 కోట్ల రూపాయల బకాయిలను ఏలూరు జిల్లాలో ఈరోజు మంత్రి విడుదల చేసి, రైతులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

..వాయిస్.. 26 సెకన్లు

-------------------------

రాష్ట్రంలో భూ, రెవెన్యూ సంబంధిత సమస్యలపై ప్రతీ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి అర్జీలు స్వీకరించనున్నట్లు రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం వేదికగా మంత్రి వెల్లడించారు ఈ నెల 15 నుంచి 30 వరకు ఈ సదస్సులు జరగనున్నాయని తెలిపారు. పెద్ద రెవెన్యూ గ్రామాల్లో రోజంతా, చిన్న రెవెన్యూ గ్రామాల్లో సగం రోజుపాటు సదస్సు నిర్వహించాలని నిర్ణయించినట్లు వివరించారు. రెవిన్యూ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు త్వరలో టోల్ ఫ్రీ నెంబర్లను అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ప్రతీ గ్రామానికి తహశీల్దార్‌తో పాటు ఏడుగురు అధికారులు వచ్చి భూ ఆక్రమణలు, 22ఏ భూముల ఫిర్యాదులపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. అర్జీలను ఆన్‌లైన్ చేసి.. దానిపై విచారణ జరిపి తగిన పరిష్కారం అందిస్తారని పేర్కొన్నారు.

--------------------------

క్షయ వ్యాధి  నివారణకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని ఎంపీడీవో కార్యాలయంలో క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను మంత్రి ఈ రోజు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ  వ్యాధి నివారణకై  ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ కార్యక్రమం కింద వ్యాధిగ్రస్తులను గుర్తించి తగిన చికిత్స అందించడంతోపాటు పోషకాహారం అందించడం జరుగుతోందన్నారు. క్షయ పోషణ అభియాన్ క్రింద టీబీ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. లక్షణాలు ఉన్నవారు సమీప ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకొని మందులు వాడాలని తెలిపారు.

--------------------------

యువత  మాదక ద్రవ్యాల  బారిన పడకుండా  అవగాహన కలిగివుండాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ కార్యక్రమంలో మంత్రి పాల్గొని. విద్యార్థులు యువతతో  ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని, మానసిక ఆరోగ్యం కూడా దెబ్బతింటుందన్నారు. వీటి నివారణకు రాష్ట్ర  ప్రభుత్వం  అనేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని మంత్రి సూచించారు.

ఇలా వుండగా శ్రీకాకుళం జిల్లాలోనూ ఈ రోజు నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాల్గొని మాట్లాడుతూ, యువతపై మాదకద్రవ్యాల ప్రభావం పడకుండా వాటి నియంత్రణే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ  కృషి చేయాలని పేర్కొన్నారు

--------------------------

హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా తిరుపతిలోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాలను పర్యాటక శాఖ ప్రాంతీయ డైరెక్టర్ ఆర్. రమణ ప్రసాద్ ఈరోజు ప్రారంభించారు.  ఈ సందర్భంగా ఆర్. రమణ ప్రసాద్ ఆకాశవాణితో మాట్లాడుతూ ప్రజల్లో దేశభక్తిని మరింత పెంపొందించే లక్ష్యంతో హర్ ఘర్ తిరంగా  ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. రెండు రోజుల పాటు కార్యక్రమాలను నిర్వహించి ప్రతి ఒక్కరికి  జాతీయ జెండాలను అందజేస్తామని తెలిపారు.

మరోవైపు చిత్తూరు నగరంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా మూడురోజులపాటు అనేక స్వాతంత్ర్య దినోత్సవానికి సంబంధించిన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

--------------------------

రాష్ట్రంలో ఇంధన వనరుల సామర్థ్యం పెంచి భవిష్యత్తులో విద్యుత్ చార్జీలను తగ్గించే అంశంపై ప్రభుత్వం అవసరమైన చర్యలను తీసుకుంటోదని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. తిరుపతిలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, 24 గంటల పాటు వినియోగదారులకు,  రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామన్నారు.  ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, ఇంధన సామర్థ్యం పెంపు, సరఫరా, పంపిణీలో నష్టాలను గణనీయంగా తగ్గించడం వంటి వివిధ చర్యల ద్వారా విద్యుత్ ఉత్పత్తి పెరిగిందని చెప్పారు. కేంద్రప్రభుత్వం

రైతులకు అందించే కుసుమ్ యోజన పథకాన్ని రాష్ట్రంలో ఏ విధంగా అందించాలనే దానిపై అధ్యయనం చేస్తున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ (18 సెకన్లు)

---------------------------

గ్రామాలలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సూచించారు. అమలాపురం కలెక్టర్ కార్యాలయం నుండి కలెక్టర్ దృశ్య మాధ్యమం ద్వారా మండల, గ్రామపంచాయతీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున కాలానుగుణ వ్యాధులు, కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ క్లోరినేషన్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాగునీటి కలుషితంతో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

---------------------------

ఖరీఫ్ ఈ –పంట నమోదును త్వరితగతిన పూర్తిచేయాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి వ్యవసాయ శాఖ అధికారులును ఆదేశించారు. జిల్లాలోని కాళ్ళ మండలం పెద్దఅమిరం పుంత రోడ్డులో ఇ–పంట నమోదు కార్యక్రమాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ, రైతులు సాగు చేస్తున్న పంట వివరాల నమోదుతోనే పంటసాయం, పంటల భీమా, తదితర ప్రభుత్వ పథకాలు అందజేయడానికి వీలవుతుందన్నారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి పంట నమోదును రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.

---------------------------

రాజధాని అమరావతిలో ప్రపంచ బ్యాంకు బృందం రెండు రోజుల పర్యటన ముగిసింది. నిన్న తాడేపల్లిలోని కొండవీటివాగు ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్‌ను ప్రపంచ బ్యాంకు బృందం ప్రతినిధులు పరిశీలించారు. వాగులోని వరదనీటిని పంపింగ్ చేసే మోటార్లతో పాటు నదిలోకి విడుదలయ్యే ప్రాంతాలను పరిశీలించి, ఎత్తిపోతల పంప్‌హౌస్, మోటార్ల సామర్థ్యం గురించి జలవనరుల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉండవల్లిలోని ప్రఖ్యాత అనంత పద్మనాభస్వామి గుహాలయాలను సందర్శించారు. శిల్పకళా నైపుణ్యం కలిగిన గుహాలయాల విశిష్టతను ప్రతినిధి బృందానికి అధికారులు వివరించారు.

---------------------------

అంతరించిపోతున్న ఏనుగులను సంరక్షించుకోవాలన్న లక్ష్యంతో ఈరోజు ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని పాటిస్తున్నాం. ప్రకృతిలో గజరాజుల ప్రాధాన్యత, వాటి సంరక్షణ పట్ల ప్రజలకు అవగాహన కలిగించడానికి ప్రతి ఏటా ఆగస్టు 12వ తేదీన ఏనుగుల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం, ముఖ్యంగా ఆఫ్రికా, ఆసియా దేశాల్లో అత్యధిక సంఖ్యలో ఉన్నటువంటి ఏనుగులపై అక్రమ వేటలను నిర్మూలించడం, ఏనుగు దంతాల వ్యాపారాన్ని పూర్తిగా నిషేధించడం లాంటి అంశాలపై ప్రస్తుతం ప్రపంచ దేశాలు దృష్టి సారించాయి.

---------------------------

విజయవాడ శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలోఈనెల 18 నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సమయంలో అన్ని ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు

తెలిపారు. ఈ మూడు రోజుల పాటు అమ్మవారికి సుప్రభాత సేవ, స్నపనాభిషేకం,అనంతరం విశేష అలంకరణ, పవిత్రమాలధారణ జరుగుతుందని, ఈ నెల 20వ తేదీ పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని వివరించారు. అనంతరం కలశోద్వాసన, మహాదాశీర్వచనం జరుగుతుందని తెలిపారు.

-----------------------------

కర్ణాటకలో తుంగభద్ర జలవనరుల శాఖ అధికారులతో రాష్ట్ర జలవనరుల శాఖ నిపుణులు సమావేశమైయ్యారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రాజెక్టు వద్దకు చేరుకున్న నిపుణుల బృందం.. డ్యామ్ ఇంజినీర్లతో ఈరోజు సమావేశమైంది. 19వ గేటు నుంచి నీటి వృథాను అరికట్టడం, కొత్త గేటు ఏర్పాటుపై వారు చర్చించారు. నీరు వృథాగా పోకుండా చేయాల్సిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లపైనా చర్చించినట్లు అధికారులు తెలిపారు.

======================